

లైసెన్స్ తప్పనిసరి

● ఆహార నియంత్రణ అధికారిణి ఈశ్వరి

పార్వతీపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకులు, మిఠాయిల తయారీదారులు విధిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని ఆహార నియంత్రణ అధికారిణి ఎస్.ఈశ్వరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనలు పాటించకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. మిఠాయి దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. లైసెన్స్ లేకుండా ఆహార పదార్థాలు విక్రయించే వారికి 6 నెలల వరకు జైలు శిక్ష విధించనున్నారని, అదేవిధంగా రూ.5లక్షలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పరిశుభ్రత పాటించని వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు.

1న ఇంటికే పింఛన్


● పెంచిన మొత్తంతో కలిపి రూ.7వేలు.. ● జిల్లాలో 1,44,518 మందికి లబ్ధి
● సమాయత్తమవుతున్న అధికారులు ● సామాజిక పింఛన్‌దారుల్లో ఆనందం



కొమరాడ, జూన్ 28: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట నిలబెట్టుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. పెంచిన పింఛన్ల పంపిణీకి ఆదేశాలు జారీ చేశారు. వచ్చేనెల ఒకటో తేదీన సచివాలయ ఉద్యోగుల ద్వారా నేరుగా పింఛన్‌దారుల ఇంటికే పింఛన్ అందించాలని ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో జిల్లాలో సామాజిక పింఛన్‌దారుల కష్టాలు తీరనున్నాయి. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, ఇతర లబ్ధిదారులు ఇక నుంచి బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. జిల్లాలో 1,44,518 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరి కోసం ప్రభుత్వం జూలైలో రూ.96.70 కోట్లు కేటాయించనుంది.

పెంపు ఇలా...

జిల్లాలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేతన్నలు, మత్స్యకారులు, కల్లు గీత కార్మికులు, డప్పు కళాకారులు, చర్మకారులు, హిజ్రాలు, హెచ్ఐవీ బాధితుల పింఛన్‌ను రూ. 3 వేలు నుంచి రూ. 4 వేలకు పెంచారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో బకాయిగా ఉన్న రూ. 3 వేలు కలిపి వచ్చేనెల ఒకటో తేదీన ఒక్కొక్కరికీ రూ. 7 వేల చొప్పున పింఛన్ అందించనున్నారు. దివ్యాంగులకు అందించే సాయాన్ని రూ. 3 వేల నుంచి రూ. 6 వేలుకు పెంచారు. కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్న వారి పింఛన్ సైతం రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచారు. మంచానికే పరిమితమైన వారికి గతంలో నెలకు రూ.5 వేల చొప్పున పింఛన్ అందించగా.. వచ్చేనెల నుంచి రూ.15 వేల చొప్పున అందజేయనున్నారు. 'జిల్లా వ్యాప్తంగా సామాజిక పింఛన్‌దారుల ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది వెళ్లి నగదు అందిస్తారు. జూలై ఒకటి,రెండు తేదీల్లో పింఛను నగదు లబ్ధిదారులకు అందేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.' అని డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు తెలిపారు.



శివారు భూములకూ నీరు

● రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
● అపర భగీరథుడు సీఎం చంద్రబాబు
● తోటపల్లి నీరు విడుదల ● మంత్రి సంధ్యారాణి



సాగునీటి విడుదలకు ముందు పూజలు చేసి హారతులిస్తున్న మంత్రి సంధ్యారాణి తదితరులు

పార్వతీపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి)/ గరుగుబిల్లి: శివారు ప్రాంత భూములకూ సాగునీరందించాలనే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం ఉల్లిభద్ర సమీపంలోని తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని కుడి ప్రధాన కాలువ నుంచి ఖరీఫ్‌నకు సాగునీరును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. తోటపల్లి ప్రాజెక్టు నుంచి తాగు, సాగునీరందించేందుకు గతంలోనే ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కృషి చేశారు. అపర భగీరథునిగా ముందుకు సాగారు. తోటపల్లిని వరంగా ఇచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయి. గతంలో బాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే పోలవరం ప్రాజెక్టు 70 శాతం పనులు పూర్తి చేశారు. రాష్ట్రం అభివృద్ధి కోసం పెట్టుబడులు సాధించేందుకు సీఎం చంద్రబాబు అవసరమైన సన్నాహాలు చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించింది. కాగా తోటపల్లి కుడి ప్రధాన కాలువ పరిధిలో సుమారు 1,31,221 ఎకరాలకు సాగునీరందేలా దృష్టి సారిస్తున్నాం. పార్వతీపురం నియోజకవర్గం పరిధి సీతానగరం, బలిజిపేట మండలాల పరిధిలోని 27 గ్రామాల్లో 13,684 ఎకరాలకు, విజయనగరం జిల్లా పరిధి బొబ్బిలి, చీపురుపల్లి, నెల్లిమర్ల, రాజాం నియోజకవర్గాల పరిధిలోని 13 మండలాల్లో 66 గ్రామాలకు చెందిన 25,060 ఎకరాలకు, శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధి జసిగడాం, లావేరు, రణస్థలం మండలాల పరిధిలోని 105 గ్రామాల్లో 38,975 ఎకరాలకు తోటపల్లి నుంచి సాగునీరు సరఫరా కానుంది. కుడి ప్రధాన కాలువ పరిధిలో 84,033 ఎకరాలకు గతంలోనే ప్రతిపాదించాం. నూతనంగా 47,188 ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరందనుంది.' అని తెలిపారు.

నిర్మాణాల పూర్తికి చర్యలు..

'తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టులతో పాటు పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణాల పూర్తికి అవసరమైన చర్యలు చేపట్టనున్నాం. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం ఖరీఫ్‌కే తోటపల్లి ప్రాజెక్ట్ పరిధిలో రైతులు పరిమితమయ్యారు. ఇకపై ఖరీఫ్, రబీలో సాగు చేపట్టే అవకాశం కల్పిస్తాం. వలసల నివారణకు చర్యలు చేపడుతున్నాం.'అని మంత్రి చెప్పారు. తోటపల్లి కాలువ పరిధిలో గండ్లుకు ఆస్కారం లేకుండా చూడాలని, పూడికలు, తుప్పలు, గుర్రపు డెక్కలను తొలగించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.

గిరిజనులకు ఐటీడీఏలు చేరువయ్యేలా..



కుడి కాలువ గుండా ప్రవహిస్తున్న నీరు

'ఐటీడీఏలను పూర్తిస్థాయిలో గిరిజనులకు చేరువయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. జిల్లా అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి.. అవసరమైన నిధులు మంజూరు చేయిస్తా. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యలను పరిష్కారిస్తా' అని ఆమె తెలిపారు.

ఆపరేషన్ గజకు సన్నాహాలు

'గత కొన్నాళ్లుగా ఈ ప్రాంతంలో ఏనుగుల సమస్య ఉంది. వాటి తరలింపునకు గతంలో నిర్వహించిన ఆపరేషన్ గజ వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.' అని మంత్రి సంధ్యారాణి వెల్లడించారు.

ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశం..

తోటపల్లి నీరు విడుదల తర్వాత మంత్రి సంధ్యారాణి ఎమ్మెల్యేలు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ.. తోటపల్లి ప్రాజెక్టు ద్వారా తమ నియోజకవర్గ వ్యవసాయ భూములకు సాగునీరు అందించే విధంగా లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలన్నారు. పార్వతీపురం నియోజకవర్గానికి సాగునీరు అందించే విషయంలో ప్రత్యేక దృష్టిసారించాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీరుకు సంబంధించి తమ నియోజకవర్గంలో ఉన్న ఇబ్బందులను తక్షణమే తొలగించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని ఉత్తరాంధ్ర జల వనరుల చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్ఈ రాజరాజేశ్వరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.రామచంద్రరావు, ఆర్.అప్పలనాయుడు, డీఈ శ్రీహరి, జేఈ శ్రీనివాసరావు, టీడీపీ నేతలు పురుషోత్తం నాయుడు, మధు సూదనరావు, రాంబాబు, తవిటినాయుడు, సత్యనారాయణ, భరత్‌కుమార్, విజయవాంకుశం, డి.రామకృష్ణ, రంజిత్‌కుమార్, సుధ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎవరికి దక్కుతాయో?

● నామినేటెడ్ పదవులపై టీడీపీ నేతల దృష్టి
● ఆరు నెలల్లో సహకార సంఘాల ఎన్నికలు
● నిర్వహించేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం

(విజయనగరం/పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో డీసీసీబీ, డీసీఎంఎస్, సాగునీటి సంఘాలు వంటి పదవులతో పాటు నామినేటెడ్ పదవుల కోసం టీడీపీ నాయకులు ఆశగా ఎదురు చూస్తున్నారు. తాజాగా డీసీసీబీ, డీసీఎంఎస్ ఛైర్మన్ల పదవులను రద్దు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. పీఏసీఎస్‌ల ఛైర్మన్ల స్థానంలో పర్సన్ ఇన్‌చార్జిలను నియమించే అధికారాన్ని జిల్లా కోపరేటివ్ అధికారికి కట్టబెడుతూ ప్రభుత్వం శుక్రవారం జీవోను విడుదల చేసింది. దీంతో సహకార సంఘాల(పీఏసీఎస్)లకు కూడా పర్సన్ ఇన్‌చార్జిలు రానున్నారు. అయితే సహకార సంఘాల అధికారులనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నట్లు సమాచారం. డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు ఇప్పటికే జేసీని పర్సన్ ఇన్‌చార్జిగా నియమించిన సంగతి తెలిసిందే.

మొదటిగా సహకార సంఘాల ఎన్నికలే?



కూటమి ప్రభుత్వంలో మొదటిగా సహకార సంఘాల ఎన్నికలే జరగనున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఇప్పటికే దీనిపై దృష్టి పెట్టింది. పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం ఆరు నెలలు. దీనికంటే ముందే ఎన్నికల నిర్వహించి కొత్త బాడీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. పీఏసీఎస్ అధ్యక్షులు అంతా కలిసి డీసీసీబీ డైరెక్టర్లను ఎన్నుకుంటారు. డైరెక్టర్లు అధ్యక్షుడ్ని, సభ్యులను ఎన్నుకునే విధంగా ప్రభుత్వం పావులు కదుపుతోంది. దీంతో ఇన్నాళ్లుగా పార్టీ కోసం పనిచేసిన నాయకులకు పదవులు దక్కనున్నాయి. జిల్లాలో పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించే దిశగా ప్రయత్నం సాగుతోంది. అలాగే సాగునీటి సంఘాల ఎన్నికలు కూడా నిర్వహించడం ద్వారా మరికొందరికి పదవులు రానున్నాయి. సాగునీటి సంఘాల విధానాన్ని టీడీపీ ప్రభుత్వమే గతంలో తీసుకు వచ్చింది. మళ్లీ ఆ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. అనేక నామినేటెడ్ పదవులు ఉన్నాయి. ఆలయాల ట్రస్టు బోర్డు ఛైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఇలా అనేకం ఉన్నాయి. వీటిపై కూడా దృష్టి పెట్టాల్సి ఉంది. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి వారికి నామినేటెడ్ పదవులు అందించాలని టీడీపీ నేతలు కోరుతున్నారు.

నదులకు వరద



వంశధార ఇలా..

గరుగుబిల్లి/భామిని,జూన్ 28 : తుఫాన్ కారణంగా ఒడిశాతో పాటు జిల్లాలో గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగావళి, వంశధార నదుల్లో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తోటపల్లి స్పిల్‌వే రెగ్యులేటర్‌కు సంబంధించి రెండు గేట్లును ఎత్తివేసి దిగువకు సుమారు రెండు వేల క్యూసెక్కులను విడుదల చేశారు. నాగావళి నదిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టిన అనంతరం స్పిల్‌వే రెగ్యులేటర్‌కు సంబంధించిన గేట్లు మూసివేస్తామని తోటపల్లి ప్రాజెక్టు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘునాథ నాయుడు, జేఈ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఇక భామిని మండలం లివిరి వద్ద వంశధార నదిలో ఒక్కసారిగా నీటిమట్టం పెరిగింది. దీంతో ఒడిశా-ఆంధ్రా నదీతీర ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నది దాటి వెళ్లలేక... సుమారు 30 కిలోమీటర్లు ప్రయాణించి స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. వర్షాలు తీవ్రంగా కురిస్తే.. మూడు నెలల వరకు నది దాటలేని పరిస్థితి ఉంటుందని ఆయా ప్రాంతవాసులు చెబుతున్నారు.



తోటపల్లి నుంచి దిగువకు నీటిని విడిచిపెడుతున్న దృశ్యం

పనిచేసినా.. వేతనం పడలేదా?

● ఎన్‌పీసీఐలో లింక్ అయిన బ్యాంక్ అకౌంట్లు చెక్ చేసుకోవాలి ● ఉపాధి వేతనదారులకు అధికారుల సూచన



జియ్యమ్మవలస : ఉపాధి హామీ పనులు చేసి రోజులు గడుస్తున్నా.. బ్యాంకు ఖాతాలో ఎందుకు డబ్బులు జమ కాలేదనుకుంటున్నారా? అందరికీ వేతనం పడినా.. తమకెందుకు రాలేదోనని ఆందోళన పడుతున్నారా! అయితే ముందుగా ఎన్‌పీసీఐలో బ్యాంకు అకౌంట్ లింక్ అయిందా? లేదా? అని తెలుసుకోండి. లేకుంటే చిక్కులు తప్పవు. వాస్తవంగా ఉపాధి హామీ పథకంలో వేతనదారులు పనులను చేసిన తరువాత వేతనాల కోసం ఎదురు చూస్తూ ఉంటారు. అయితే అందరికీ ఒకేసారి వేతనాలు జమ చేసినా.. కొందరు వేతనదారులు మాత్రం తమ ఖాతాలో డబ్బులు పడలేదని టెన్షన్ పడుతుంటారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు కూడా చేస్తుంటారు. అయితే అంతకంటే ముందు వేతనదారులు తమ బ్యాంకు ఖాతా నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)లో లింక్ అయిందా? లేదా? అనేది ఒక్కసారి చెక్ చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో పాలకొండ, పార్వతీపురం డివిజన్లు ఉన్నాయి. వీటిని ఉపాధి హామీ పథకంలో 15 బ్లాకులుగా విభజించారు. మొత్తంగా 450 గ్రామ పంచాయతీల పరిధిలో 2.08 లక్షల జాబ్‌కార్డులున్నాయి. మొత్తం 3.94 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. 1.92 జాబ్‌కార్డులు యాక్టివ్‌గా ఉండగా, వీటి పరిధిలో 3.52 లక్షల మంది వేతనదారులు రోజూ ఉపాధి పనులకు వెళ్తున్నారు. కాగా ఉపాధి వేతనదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు ప్రతి వారం వేతనాలు జమ చేస్తుంటారు. కానీ చాలామంది వేతనదారులకు తమ ఖాతాలో వేతనం సొమ్ము పడలేదని ఆందోళన చెందుతున్నారు. అందుకు గల కారణాలను ఇప్పుడు తెలుసుకుందాం.

- చేసిన పనులకు సకాలంలో డబ్బులు రాలేదనే వేతనదారుల్లో చాలామందికి రెండు, అంతకంటే ఎక్కువ బ్యాంకుల్లో అకౌంట్లు ఉంటాయి. అయితే వాటికి ఆధార్‌కార్డు, ఎన్‌పీసీఐతో లింక్ చేయించకపోవడం వల్ల అకౌంట్లలో డబ్బులు పడడం లేదు. వారికున్న అకౌంట్లలో ఏదో ఒక అకౌంట్ ఎన్‌పీసీఐతో లింక్ అయి ఉంటే ఆ బ్యాంకు ఖాతాకే వేతనం జమవుతుంది.
- ఒకవేళ ఏ అకౌంట్ ఎన్‌పీసీఐతో లింక్ అయి ఉందో తెలియకపోతే .. బ్యాంకు అధికారులను సంప్రదించాలి. అనంతరం ఖాతా బుక్ జెరాక్స్ కాపీని ఉపాధి హామీ సిబ్బంది అందించాలి. అప్పుడు ఉపాధి వేతనం ఆ అకౌంట్‌కు జమ అవుతుంది.
- పోస్టాఫీసులో అకౌంట్ ఓపెన్ చేసి దానిని ఆధార్ కార్డు, ఎన్‌పీసీఐతో లింక్ చేసుకుని ఆ వివరాలను ఉపాధి హామీ అధికారులకు తెలియజేయచ్చు.
- ఒకవేళ ఉపాధి వేతనదారు మరణించిన సందర్భాల్లో.. మరణ ధ్రువపత్రం, ఆధార్ కార్డు కాపీలను నామినీగా ఉన్నవారు ఉపాధి హామీ అధికారులకు అందించాలి. అప్పుడు ఆ డబ్బులు నామినీ బ్యాంకు అకౌంట్‌కు జమవుతాయి.



చినమేరంగిలో వేతనాలు ఎందుకు జమకాలేదని ఏపీడీ సురేష్‌నాయుడును అడుగుతున్న ఉపాధి వేతనదారులు (ఫైల్)



పాఠశాల విద్యను ప్రైవేటుపరం చేయొద్దు

● ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: పాఠశాల విద్య ప్రైవేటు పరం కావడానికి ప్రభుత్వ నిర్ణయాలు దోహదపడుతున్నాయని, వీటిని నూతనంగా కొలువుదీరిన ప్రభుత్వం సరిచేయాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ కోరారు. గుమ్మలక్ష్మీపురంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శుక్రవారం మాట్లాడారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు అమ్మఒడి పథకాన్ని వర్తింపజేయడం, ఈ డబ్బు విద్యా సంవత్సరం ప్రారంభంలో జమ చేయడం, వేలాది గ్రామాల్లో 3, 4, 5 తరగతులు అందుబాటులో లేకపోవడం, ఇవన్నీ తల్లిదండ్రుల దృష్టి ప్రైవేటు పాఠశాలల వైపు మరలే విధంగా చేస్తున్నాయన్నారు. నిర్బంధంగా అమలు చేస్తున్న యాప్‌ల నిర్వహణ వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన కంటే విద్యేతర కార్యక్రమాల అమలు ప్రధామని తల్లిదండ్రులు అంచనాకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు దుర్గారావు, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌రావు, బంటు సింహాచలం పాల్గొన్నారు.

నవధాన్యాలతో అధిక లాభాలు



లఖనాపురంలో నవధాన్యాల సాగును పరిశీలిస్తున్న అధికారులు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చునని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ రిసోర్స్‌పర్సన్ పి.దేముళ్లు అన్నారు. మండలంలోని రావివలస, లఖనాపురం గ్రామాల్లో నవధాన్యాల సాగును ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సమయంలో సాగు చేస్తున్న నవధాన్యాలకు వర్షాలు అనుకూలంగా ఉన్నాయని, దీని ద్వారా అధిక దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. రీజనల్ తేమిటిక్ లీడ్ కె.ప్రసాద్ మాట్లాడుతూ మెట్టు, పోడు భూముల్లో చిరుధాన్యాల సాగుకు చొరవ చూపాలని సూచించారు. ఈ పరిశీలనలో రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్, ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జి వి.పోలినాయుడుతో పాటు రైతులు ముదిలి విజయవాంకుశం, పోలినాయుడు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీల్లో నిబంధనలు పాటించాలి



గొట్టివలసలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి నిర్వహిస్తున్న సామాజిక తనిఖీలను నిబంధనల మేరకు చేపట్టాలని పరిశీలకుడు దొనక చిరంజీవి అన్నారు. గొట్టివలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాటు ఉపాధి నిధులతో నిర్వహించిన పనులు పరిశీలనకు అధికారులు పలు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలన తదుపరి లోపాలు ఉన్నట్లయితే గ్రామసభలో తెలియపర్చాలన్నారు. ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు చేపట్టిన తనిఖీల వివరాలను పరిశీలించారు. జూలై 9న మండల కేంద్రంలో ప్రజావేదిక నిర్వహణ ఉంటుందని చెప్పారు. డీఆర్‌పీ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పింఛన్లు, ఉపాధి పనులు, నర్సరీలను పరిశీలించి వేతనదారుల నుంచి సమాచారాన్ని సేకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎం.గౌరీనాథ్, ఏఈ వి.అఖిల్, కార్యదర్శి టి.భాస్కరరావు, సర్పంచ్ బి.చంద్రినాయుడు, క్షేత్ర సహాయకులు నల్ల సూర్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న అంతర్ రాష్ట్ర రహదారి మరమ్మతులకు అంచనాలు వేసి, ప్రభుత్వానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తామని రోడ్లు భవనాల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పాజీ తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన గోతులు దారిలో వెళ్లేదెలా కథనంపై ఆయన స్పందించారు. ఈమేరకు రహదారిపై ఏర్పడిన గోతులను పరిశీలించారు. రహదారి మరమ్మతులు చేపట్టవలసిన ప్రాంతాలను గుర్తించి కొలతలు తీస్తున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి నిధులు కోసం ప్రతిపాదనలు పంపిస్తామని, నిధులు మంజూరైన వెంటనే మరమ్మతు పనులు చేపడతామని తెలిపారు.

ఒరిగిన లారీ



మట్టిలో కూరుకుపోయిన లారీ

మక్కువ: స్థానిక శ్రీదేవి కాలనీ జంక్షన్ మలుపు వద్ద చిన బోగిలి మీదుగా రాయపూర్‌కు బొగ్గు సామగ్రితో వెళుతున్న లారీ గురువారం రాత్రి పది గంటల సమయంలో రోడ్డు అంచు వెంబడి మట్టిలో కూరుకుపోయి పక్కకు ఒరిగింది. బొబ్బిలి మండలం పారాది వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీంతో భారీ వాహనాలను మక్కువ నుంచి చినబోగిలి మీదుగా తరలిస్తున్నారు. పూర్తిగా పాడైన ఈ రహదారి వల్ల పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం భారీ వాహనాలతో దుమ్ము, ధూళి రేగుతున్నాయి. మట్టిలో కూరుకుపోయిన లారీని వెలికి తీసేందుకు రెండు భారీ క్రేన్లు తెప్పించాల్సి వచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో లారీని సురక్షితంగా బయటకు తీశారు. లారీ కూరుకుపోవడంతో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడింది.

ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయాలి

● జీవో 164ను పునరుద్ధరించాలి

● మంత్రి సంధ్యారాణిని కోరిన టీడీపీ నేతలు

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో మూడు ఎత్తిపోతల పథకాలు మంజూరుకు చొరవ చూపాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని పలువురు టీడీపీ ప్రతినిధులు కోరారు. శుక్రవారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సమక్షంలో పలు సమస్యలను పార్టీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు, అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. 2019లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న సమయంలో ఫిబ్రవరి 25న మూడు ఎత్తిపోతల పథకాలు మంజూరు చేశారని చెప్పారు. ఈ పథకాలకు అవసరమైన ప్రత్యేక జీవో 164ను విడుదల చేశారన్నారు. గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల పరిధిలోని పది గ్రామాలకు సంబంధించి సుమారు 8 వేల ఎకరాలకు పైగా సాగు, తాగునీరందే విధంగా చర్యలు చేపట్టినా తదుపరి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేసిందన్నారు. రద్దు చేసిన జీవోను ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం పునరుద్ధరించి సాగునీరందేలా కృషి చేయాలని వారు కోరారు. సాగునీరందక సుమారు పది వేల ఎకరాల మేరకు బీడు భూములుగా మారుతున్నాయని తెలియజేశారు. దీనిపై స్పందించిన మంత్రి.. ఉత్తరాంధ్ర జల వనరుల చీఫ్ ఇంజినీర్ ఎస్.సుగుణాకరరావుకు సమాచారం అందించారు. రైతుల సమస్యలపై స్పందించి పునరుద్ధరణకు అవసరమైన సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి తగు పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాగూరు ఎంపీటీసీ సభ్యులు, అరకు బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ, పార్టీ జియ్యమ్మవలస మండల అధ్యక్షుడు పల్ల రాంబాబు తదితరులు ఉన్నారు.

మంత్రికి ఘన సన్మానం

మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొట్టమొదటిగా మండలానికి వచ్చిన గుమ్మిడి సంధ్యారాణికి టీడీపీ మండల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మర్రాపు పురుషోత్తంనాయుడు, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే మొదటిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణలను సన్మానించారు. ఈసందర్భంగా పలు సమస్యలను మంత్రితో పాటు ఎమ్మెల్యేలకు వివరించారు. పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు, అరకు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ, గొట్టాపు లక్ష్మణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సాలూరు: అన్న క్యాంటీన్‌కు స్థల సేకరణ చేస్తున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరులో అన్నక్యాంటీన్‌కు శ్రీకారం

సాలూరు: పట్టణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం తహసీల్దారు కార్యాలయ సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. అక్కడే అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు ఆమె అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పేదవాడికి పట్టెడు అన్నం పెట్టి వారి కడుపు నింపాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో 188 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జూలై 15 నుంచి ఇవి అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. అందులో భాగంగా సాలూరులోనూ అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అన్న క్యాంటీన్‌తో సాలూరుతో పాటు పాచిపెంట, మక్కువ, సాలూరు మండలం, రామభద్రపురం ప్రాంతాల వారికి లబ్ధి కలుగుతుందని అన్నారు. కేవలం ఐదు రూపాయలకే భోజనం అందిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్దాక్షిణ్యంగా అన్న క్యాంటీన్లను తొలగించిందని విచారం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే దీనికి సంబంధించి సంతకం చేశారని గుర్తు చేశారు. అధికారులు దీనికి సంబంధించి కొలతలను ఉన్నతాధికారులకు అందించాలని ఆదేశించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, నాయకులు నిమ్మాది తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

పాలకొండ: జిల్లాలో ఉన్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి శుక్రవారం వినతిపత్రం అందించారు. అప్పలనాయుడు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో వెంగళరాయ, పెద్దగెడ్డ, సీతానగరం, పెదంకలాం ఆధునికీకరణ, రావాడగెడ్డ, తోటపల్లి కాలువల ఆధునికీకరణ, పెదబుడ్డి వద్ద ఒట్టిగెడ్డపై అక్విడెక్ట్, జంపరకోట రిజర్వాయర్ పెండింగ్ పనులు పూర్తి చేయించాలన్నారు. భామిని మండలం కొండలోయగెడ్డ, వడ్డంగి లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు నిధులు మంజూరు చేయించాలని విన్నవించారు. ఒడిశాలో ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉందని, రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న పనులకు మోక్షం కలిగించే 24 వేల ఎకరాల ఆయకట్టు రైతుల ఆశలు నెరవేర్చాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం నాయకులు ఈవీనాయుడు, కనపాక చౌదరి నాయుడు, చేబోదుల లక్ష్మీనారాయణ, పామోటి వైకుంఠరావు, బొత్స గౌరునాయుడు తదితరులు ఉన్నారు.

మున్సిపాల్టీ ప్రజల రుణం తీర్చుకుంటా

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

● మున్సిపల్ సాధారణ సమావేశం

పార్వతీపురంటౌన్: గత ఎన్నికల్లో టీడీపీ పక్షాన నిలబడిన మున్సిపాల్టీ ప్రజల రుణం తీర్చుకుంటానని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మొట్టమొదటి సారిగా ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా హాజరైన విజయచంద్ర, కౌన్సిల్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. మున్సిపాల్టీలో తాగునీరు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కేంద్రంలో నడిబొడ్డులో ఉన్న మురికివాడల్లోగల ప్రజల జీవన పరిస్థితి చాలా దారుణంగా ఉందని, వారి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రచించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మున్సిపాల్టీ అభివృద్ధికి అధికార, ప్రతిపక్షాలే కాకుండా కుల, మత బేధాలకు అతీతంగా మనమంతా సమిష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.

దుష్ట సంస్కృతికి స్వస్తి

జిల్లా కేంద్రానికి ప్రథమ పౌరురాలు, మున్సిపల్ చైర్‌పర్సన్ పక్కన కుర్చీ వేసుకుని కూర్చునే అర్హత ఏ ఎమ్మెల్యేకు లేదని ఎమ్మెల్యే విజయచంద్ర స్పష్టం చేశారు. అలాంటి దుష్ట సంస్కృతికి స్వస్తి పలుకుతున్నట్లు ప్రకటించారు. దీంతో సమావేశ మందిరం అభినందనలతో మారుమోగింది.

సమస్యలపై ప్రస్తావన

సమావేశంలో వివిధ సమస్యలపై ఆయా కౌన్సిలర్లు ప్రస్తావించారు. మున్సిపాల్టీలో గత ప్రభుత్వ హయాంలో సుమారు 30 మందిని వివిధ విభాగాల్లో కార్మికులుగా నియమించారని, ఇప్పటివరకు వారు ఏఏ విభాగాల్లో పని చేస్తున్నారో తెలియజేయాలని కమిషనర్ కె.శ్రీనివాసరావును 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు కోరారు. కొత్తవలసలోని నాలుగు వార్డుల్లో శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని 14వ వార్డు కౌన్సిలర్ డి.శ్రీదేవి.. ఎమ్మెల్యేతో పాటు అధికారులను కోరారు. గత ప్రభుత్వ హయాంలో టిడ్కో పథకంలో భాగంగా మధ్య తరగతి ప్రజల నుంచి లక్షలాది రూపాయలను వసూలు చేశారని, వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ టిడ్కో లబ్ధిదారులతో పాటు జగనన్న కాలనీల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తునకు ఒక కమిటీని నియమించి లెక్కలు తేల్చుతామని చెప్పారు. బాధితులకు సంబంధించి వివరాలు సేకరించి, నిజమైన అర్హులకు స్థలాలు, పట్టాలు ఇచ్చేందుకు శాయశక్తుల పనిచేస్తానని హామీ ఇచ్చారు.



సభా మర్యాదను పాటిస్తూ తనకు కేటాయించిన కుర్చీలో కూర్చున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పేదలందరికీ న్యాయం చేస్తాం

పార్వతీపురం రూరల్: టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పేదవానికి సొంత ఇల్లు ఉండాలని ప్రారంభించిన టిడ్కో ఇళ్ల లక్ష్యాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దెబ్బతీసే విధంగా వ్యవహరించారని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆరోపించారు. శుక్రవారం అడ్డాపుశీల ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను ఆయన పరిశీలించారు. ఇక్కడ కూడా అవినీతి జరిగిందని, పేదవారినీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వదలలేదని ఆరోపించారు. 2018లో టిడ్కో లబ్ధిదారుల జాబితాను రూపొందించారని.. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ జాబితాను పూర్తిగా మార్చివేసి తమ కార్యకర్తలకు ఇళ్లు కేటాయించిందని ఆరోపించారు. ఇళ్ల కోసం డబ్బులు చెల్లించిన వారు వడ్డీలు కట్టలేక అప్పుల పాలయ్యారని... ఇళ్లు కూడా దక్కలేదని విచారం వ్యక్తం చేశారు. గతంలో ఇళ్ల కోసం డీడీల రూపంలో డబ్బులు చెల్లించిన వారికి న్యాయం చేస్తామని, వారికి ఇళ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, బార్నాల సీతారాం, కోరాడ నారాయణరావు, డాక్టర్ భానుప్రసాద్, జి.రవికుమార్, పెంట సత్యం, వెంకటప్పలనాయుడు, అక్కేన శివ, కోలా మధు, పాలకొండ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం

● దళితులపై దాడులకు నిరసన

గరుగుబిల్లి: శివ్వాంలో భూసమస్యకు అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని సీపీఎం ప్రతినిధులు ఎం.కృష్ణమూర్తి, బీవీ రమణ, మన్మథరావు, కె.గంగునాయుడు విమర్శించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళితులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. దళితులకు చెందిన భూముల్లో గ్రామంలోని పెత్తందారులు ఆక్రమణలకు చొరబడుతున్నారని తెలిపారు. సాగు చేస్తున్న భూముల్లో దళితులపై దాడులకు పాల్పడటం విచారకరమన్నారు. 1970లో ప్రభుత్వం శివ్వాం పరిధిలోని 14 దళిత కుటుంబాలకు సర్వే నెంబర్లు 20, 21, 23, 26, 29, 30లలో 22.80 ఎకరాలకు డీపట్టాలు మంజూరు చేశారని చెప్పారు. అప్పటి నుంచి దళితులు సాగు చేసుకుంటున్నారన్నారు. బీసీ కులానికి చెందిన పలువురు సర్వే నెంబరు 102లోని భూములకు న్యాయస్థానం నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చి దళితులకు చెందిన భూములపై తెచ్చినట్లు అధికారులను నమ్మబలికారన్నారు. దళితులు సాగు చేయకుండా వెళ్లగొట్టారని విమర్శించారు. దళితులు తమ భూములను కాపాడుకొనేందుకు పలు దఫాలు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారని తెలిపారు. రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో రికార్డులు పరిశీలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులు దళితుల పేరున రికార్డుల్లో నమోదు చేసిన మేరకు భూములు అప్పగించాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడులకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరారు. అలాగే దళితులపై పెత్తందారులు పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం జరగకుంటే ఉద్యమాలు తప్పవన్నారు. అధికారులు ఇచ్చిన హామీలను విధిగా అమలు పర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో శివ్వాంకు చెందిన పలువురు పాల్గొన్నారు.



గరుగుబిల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు, సీపీఎం నాయకులు

దాడులకు పాల్పడ్డ వారిపై చర్యలు: డీఎస్పీ కృష్ణారావు

శివ్వాం గ్రామంలో దళితులపై దాడులకు పాల్పడిన వారిపై అవసరమైన చర్యలు చేపడతామని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం శివ్వాంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిందని, సంబంధిత భూముల సమాచారాన్ని సేకరించామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సమన్వయంతో సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. దళితుల భూ సమస్యను సీపీఎం ప్రతినిధి మూడడ్ల కృష్ణమూర్తి డీఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కె.జయ, చినమేరంగి సీఐ మంగరాజు, ఎస్ఐ వై.అమ్మన్నరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

సాలూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి కమిషనర్ శ్రీరామమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులతో పాటు అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

భామిని: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి దామోదర్ తెలిపారు. శుక్రవారం మనుమకొండ గ్రామంలో పరిసరాలు పరిశుభ్రత చేపట్టి కాలువల్లో స్ప్రేయింగ్, డ్రింకింగ్ వాటర్, బ్లీచింగ్, చెత్తాచెదారం తొలగింపు, ఇంటింటా జ్వరాలపై ఆరా చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

భద్రగిరి ఆర్ఐటీఐలో రెండో విడత కౌన్సెలింగ్

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ఆర్ఐటీఐలో రెండో విడత కౌన్సెలింగ్ కోసం ఈ నెల 29 నుంచి జూలై 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సి.హెచ్.సునీల్‌కుమార్ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటిఐ.ఏపీ.జీవోవి.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జూలై 25లోపు దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. జూలై 27 ఉదయం 10 గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

వెలుగు కార్యాలయంలో ఆడిట్

వీరఘట్టం: మండలంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం చార్టర్డ్ అకౌంటెంట్ ఎం.సీతారాం ఆధ్వర్యంలో ఆడిట్ నిర్వహించారు. గ్రామ సంఘాలు, మండల సంఘా ల్లోని వివిధ పద్దులకు సంబంధించిన వివరాలను పరిశీ లించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బి.శివనాయుడు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జయకృష్ణకు అభినందనలు

వీరఘట్టం: ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారి ఎం.రాజపురం గ్రామం వచ్చిన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు శుక్రవారం పలువురు అభినందనలు తెలిపారు. మండలంలోని వివిధ శాఖల సిబ్బంది, గ్రామాల నాయకులు, కార్యకర్తలు వచ్చి అభినందనలు తెలిపారు.

ఉదయం ఆరు గంటలకే పింఛన్ పంపిణీ ప్రారంభం

వీరఘట్టం: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ జూలై 1వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్ పంపిణీ ప్రారంభించాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో ఎంబీ సుబ్రహ్మణ్యం సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని రకాల పింఛన్లు కలిపి 9,954 ఉన్నాయని, వాటికి రూ.6కోట్ల 66లక్షల 77వేల 500 ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఎటువంటి పొరపాట్లు చేయకుండా సిబ్బంది సక్రమంగా పింఛన్లు పంపిణీ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అశోక్ సేవలు చిరస్మరణీయం

ఒడిశా



అశోక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొండబాబు తదితరులు

రాయగడ: రాయగడ లారీ యజమానుల సంఘం కార్యదర్శిగా, పురపాలక సంస్థ ఉపాధ్యక్షుడిగా దివంగత అశోక్ పాణిగ్రాహి చేసిన సేవలు చిరస్మరణీయమని లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు (కొండబాబు) అన్నారు. దివంగత అశోక్ పాణిగ్రాహి వర్ధంతి సందర్భంగా శుక్రవారం లారీ యజమానుల సంఘం కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కె.జానకిరామయ్య, మోటారు కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు ముచ్చి రమణ, కోట సూర్య, బాలాజీ పాత్ర, బి.రవికుమార్ లారీ యజమానులు పాల్గొన్నారు.

మృతదేహం గుర్తింపు

రాయగడ: లడ్డ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాల దగ్గర శుక్రవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, స్టేషన్‌మాస్టర్‌కు తెలిపారు. ఆయన రాయగడ స్టేషన్ మాస్టర్ పంకజ్‌కుమార్ రాయ్‌కు సమాచారం అందించగా, ఆయన రాయగడ జీఆర్పీ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయసు 60 నుంచి 65 ఏళ్లు ఉంటుందని, మృతుడు ఖాకీ నిక్కరు, తెలుపు టీషర్టు ధరించాడని, అతని వద్ద మరెలాంటి ఆధారాలు లేవని పోలీసులు తెలిపారు. రైలు నుంచి జారిపడి మరణించాడా.. ఎవరైనా పడవేశారా.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

భామిని: భామిని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. స్కూల్ కెప్టెన్‌గా ముగ్గురు పోటీపడగా స్కూల్ వైస్ కెప్టెన్‌గా నలుగురు, స్పోర్ట్స్ కెప్టెన్‌గా ఏడుగురు బరిలో దిగారు. పాఠశాల విద్యార్థుల జాబితా, వారి సంతకాలు, వారికి బ్యాలెట్ పేపర్ ఇస్తూ స్వస్తిక్ గుర్తుతో బ్యాలెట్ పేపర్‌లో నమోదు చేసి బ్యాలెట్ బాక్సులో వేశారు. శనివారం ఈ బ్యాలెట్ పేపర్లను లెక్కించి మెజార్టీ ఉన్న విద్యార్థులకు స్కూల్ కెప్టెన్, స్కూల్ వైస్ కెప్టెన్, స్పోర్ట్స్ కెప్టెన్‌గా ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర అధ్యాపకులు ముత్యాలు, కె.నర్సయ్య, ఆర్.సంతోష్‌కుమార్, సూరిబాబు పాల్గొన్నారు.

బీఎల్వోల పారితోషికం విడుదల చేయాలి

సాలూరు: సాలూరు మున్సిపాల్టీలో బీఎల్వోలుగా పని చేస్తున్న సిబ్బందికి తక్షణం పారితోషికాన్ని మంజూరు చేయాలని తహసీల్దార్ సింహాచలానికి వారు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం బీఎల్వోలు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత మూడేళ్లగా తమకు రావాల్సిన రెమ్యూనరేషన్ తక్షణం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎల్వోలు

ఇంటి వద్దకే పింఛన్లు

మక్కువ: వచ్చే నెల ఒకటో తేదీన పింఛనుదారులకు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే పింఛను అందించనున్నట్టు ఎంపీడీవో పి.దేవకుమార్ శు క్రవారం తెలిపారు. మండలంలో 8,520 మంది పింఛనుదారులు ఉన్నారని, 190 మంది సచివాలయ సిబ్బందితో ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్ పంపిణీ ప్ర క్రియ ప్రారంభిస్తామని చెప్పారు. లబ్ధిదారులు ఎవరూ తమ పరిధిలోని సచివాలయాలకు రావద్దని, ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు.





ఖాళీ స్థలం ఉంటే.. కబ్జాయే

● వైసీపీ నేతల ఆగడాలు

● అడ్డుకట్ట వేయాలని కోరుతున్న ప్రజలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా ప్రతినిధులు చేసిన ఆక్రమణలు, అక్రమాలు ఇప్పుడిప్పుడే బయట పడుతున్నాయి. అధికార బలం, రెవెన్యూ యంత్రాంగం అండదండలతో దందాలకు తెరలేపారు. ఖాళీ జాగా కనబడితే చాలు ఆ స్థలం వారి చేతుల్లోకి రావలసిందే. వెంటనే బినామీలను రంగంలోకి దించేస్తారు. వారికి అనుకూలంగా ఉండే స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిని రంగంలోకి దించి రికార్డులు తారుమారు చెయ్యగలిగిన ఘనులు వైసీపీ నేతలు. ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేక చోట్ల చోటు చేసుకున్నాయి. ఎదురు తిరిగిన వారిపై బెదిరింపులు, భౌతిక దాడులకు తెగబడిన ఘటనలు కోకొల్లలు. ● డెంకాడ మండలం గుణుపూరుపేట వద్ద గల ఆనందరాజు చెరువులోని సుమారు 15 ఎకరాల వరకు ఓ వైసీపీ నేత కుటుంబంతో సహా మరో 18 మంది పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. టీడీపీ ప్రభుత్వం రాకతో గ్రామస్థులు కబ్జాను అడ్డుకున్నారు. దీనిపై ఆర్డీడీ, ఆర్డీవోకి వినతిపత్రం అందజేశారు. ఈ కబ్జా స్థలం విలువ సుమారు రూ.50 కోట్లపైనే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. విచారణ అనంతరం అధికారులు అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారు.

● విజయనగరం రాజీవ్ నగర్ కాలనీ మొదటి లైన్‌కు ఆనుకుని ఉన్న మాన్సాస్ భూములను ఆక్రమించి వైసీపీ కీలక నేతకు చెందిన వ్యక్తి వాటర్ సర్వీసింగ్ సెంటర్ ఏర్పాటు చేశాడు. నీరు వెళ్లేందుకు వీలుగా కాలనీ వైపు కాలువను తవ్వేశారు. దీంతో వర్షం వస్తే ఇళ్లల్లోకి మురుగు నీరు చేరుతోంది. ఈ విషయమై గతంలో ప్రశ్నిస్తే కబ్జాదారులు దాడులకు పాల్పడ్డారని బాధితులు చెబుతున్నారు. ఈ స్థలం విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుందని అంచనా.

● కేఎల్‌పురం వద్ద గల సర్వే నెంబరు 30/20లోని జర్నలిస్టు కాలనీలో మిగిలిన స్థలాన్ని ఓ వైసీపీ ప్రజా ప్రతినిధి ఆక్రమించి, తమవారికి అంటగట్టాడు. ఎమ్మెల్యేల వద్ద పనిచేసిన వారికి కొంతమందికి పంచేశాడు. దీనిపై విచారణ చేపట్టాలని గతంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఆర్డీవో సూర్యకళకు తెలిపినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ప్రభుత్వాలు మారినా వైసీపీ నేతల సేవలోనే రెవెన్యూ యంత్రాంగం పని చేస్తోందన్న అపవాదు మూటగట్టుకుంటున్నారు.

● **గ్రామకంఠం కబ్జా**

తాజాగా పినవేమలిలో ఓ ప్రజాప్రతినిధి గ్రామానికి చెందిన గోర్జిని ఆక్రమించి కబ్జాచేసిన వైనం వెలుగులోకి వచ్చింది. పొట్నూరు గోర్జిగా పిలవబడే గ్రామకంఠంలోని సుమారు 40 లింకుల స్థలాన్ని మట్టితో నింపేశారు. వెంటనే ఆ స్థలాన్ని 8 భాగాలు బిట్‌లుగా చేసి అమ్మేశాడు. దీంతో ఆ గోర్జి వెంట వెళ్లే నాటు బళ్లకు, వర్షపు నీరు వెళ్లేందుకు తోవలేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పినవేమలి గ్రామంలో కబ్జాకు గురైన గోర్జి స్థలంలో వెలసిన కళ్లాలు

గతంలో ఇదేంటని ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడ్డారని, రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. అదే గ్రామంలో ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఉంటున్న పేద కుటుంబాన్ని బెదిరించి, ఇంకో చోట స్థలం ఇస్తామని చెప్పి అక్కడి నుంచి తరిమేశారు. తదనంతరం రియల్ వెంచర్‌కు అనువుగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని చూశారు. ఆ కుటుంబం మళ్లీ అక్కడే ఓ గుడిసె వేసుకోగా రాత్రికి రాత్రే తగులబెట్టారు. ఇదీ ఆ వైసీపీ నేత పనేనని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇలా వైసీపీ నేతల భూ కబ్జాలకు, బెదిరింపులకు అడ్డూ అదుపూ లేకుండా ఉందని, వీరి అరాచకాలకు కొంతమంది రెవెన్యూ అధికారులు వత్తాసు పలకటంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే అదితి, కలెక్టర్ అంబేడ్కర్ స్పందించి తక్షణం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

తీరిన వరదనీటి సమస్య

● స్పందించిన ఎమ్మెల్యే అదితి

● సోషల్ మీడియాలో ట్యాగ్ చేయడంతో ఒక్కరోజులో పరిష్కారం

విజయనగరం (ఆంధ్రజ్యోతి) జూన్ 28: విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు పరిపాలనలో దూకుడు పెంచారు. సోషల్ మీడియాలో ట్యాగ్ చేసిన సమస్యకు తక్షణమే పరిష్కారం చూపించి అభినందనలు అందుకున్నారు. నగరంలో గడిచిన రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా నగరం నుంచి వైఎస్ఆర్ కాలనీకి వెళ్లే మార్గంలోని, రైల్వే బ్రిడ్జి వద్ద కాలువలు, డ్రైనేజీ పైపులైన్‌లో వ్యర్థాలు, పూడిక పేరుకుపోవటంతో ఆ మార్గమంతా వరదనీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రెండేళ్లనుంచి ఉన్న గత పాలకులు, అధికారులు పట్టించుకోక పోవటంతో ఈ సమస్య మరింత జటిలమైంది. గురువారం కురిసిన వర్షానికి పెద్దఎత్తున నీరు చేరుకోవటంతో స్కూల్ విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఆ మార్గం గుండా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో స్థానిక రమేష్ అనే యువకుడు సమస్యను ప్రస్తావిస్తూ ఫొటోలతో సహా ఎమ్మెల్యే అదితికి వాట్సాప్ ద్వారా సమస్యను వివరించారు. సమస్యపై స్పందించిన ఆమె ఉదయాన్నే నగరపాలక సంస్థ అధికారులను అలెర్ట్ చేసి, యుద్ధ ప్రాతిపదికన సమస్యను పరిష్కారించాలని ఆదేశించటంతో ఒక్క పూటలో కాలువల్లో పూడిక తీత, పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించి మురుగునీటిని తరలించారు. దీంతో పరిపాలనలో అదితి దూకుడుకు స్థానిక విద్యార్థినులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



గురువారం చెరువులా మారిన వైఎస్ఆర్ నగర్ రోడ్డు



శుక్రవారం జేసీబీలతో పూడిక తీస్తున్న దృశ్యం

ప్లాస్టిక్ గ్లాసులు విక్రయిస్తున్న వారికి జరిమానా



బొబ్బిలిలో షాపులను తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

బొబ్బిలి, జూన్ 28: బొబ్బిలి పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ గ్లాసులు విక్రయిస్తున్న షాపులపై మున్సిపల్ అధికారులు శుక్రవారం తనిఖీలు జరిపి షాపుల యజమానులకు జరిమానా విధించారు. కమిషనరు లాలం రామలక్ష్మి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ తమ సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేశారు. మొత్తం 15 షాపులను తనిఖీ చేసి 8 వేల రూపాయల అపరాధ రుసుం విధించారు. హోల్‌సేల్ షాపులకు రెండువేలు, చిన్న షాపులకు 500 రూపాయల చొప్పున జరిమానా విధించి ప్లాస్టిక్ గ్లాసులను, ఇతర సామగ్రిని సీజ్ చేశారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్ విక్రయాలపై నిషేధం ఉన్నందున ప్లాస్టిక్ విక్రయాలు జరపరాదని షాపుల యజమానులను అధికారులు హెచ్చరించారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

రేగిడి: విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం ఉణుకూరు శ్రీ లక్ష్మీగణపతి ట్రేడర్స్ శ్రీరామ ట్రేడర్స్, జోడిబందల, బూరాడ సెంటర్లలో షాపులను తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలి గించినా షాపుల యాజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ● **బాడంగి:** మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి కే.శిరీష శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విత్తనాలు, ఎరువుల నాణ్యతా ప్రమాణాల కలిగినవి మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించినా, నాణ్యతాప్రమాణాలు పాటించకపోయినా చర్యలు తీసుకుంటామన్నారు. వరి, మొక్కజొన్న విత్తనాలను తీసి విత్తన పరీక్షా కేంద్రానికి తరలించారు. రికార్డులు, ధరల పట్టిక తప్పనిసరిగా నిర్వహించాలన్నారు.

రైల్వే క్రాసింగుల వద్ద ఫ్లైఓవర్లు నిర్మించాలి

● రైల్వేమంత్రిని కోరిన ఎంపీ కలిశెట్టి

విజయనగరం: ప్రజలు నిత్యం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న రైల్వే క్రాసింగుల వద్ద ఫ్లైఓవర్ వంతెనలు నిర్మించాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. శుక్రవారం ఢిల్లీలో రైల్వే శాఖ మంత్రి కార్యాలయానికి వెళ్లారు. మంత్రి అందుబాటులో లేని కారణంగా అక్కడున్న ఓఎస్‌డీ వేద ప్రకాష్‌కు వినతి పత్రం అందించారు. పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే మార్గంలో ఐదు కిలోమీటర్ల దూరంలో మూడు రైల్వే క్రాసింగులున్న విషయాన్ని ఉదహరించారు. విశాఖ పోర్టు నుంచి ఒడిశా వైపు వెళుతున్న పరిశ్రమల ముడిసరకు రవాణాకు కలుగుతున్న ఇబ్బందులు ప్రస్తావించారు. ప్రతి ఐదు నిముషాలకు గేటు పడుతున్న కారణంగా ప్రయాణికులు, రవాణా వ్యవస్థ, రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కదిలిన అధికారులు

● ముంపు సమస్య పరిష్కారంపై దృష్టి



పాఠశాల ప్రాంగణంలో సర్వశిక్షాభియాన్ ఈఈ, డీఈ తదితరులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జామి: మండల కేంద్రంలోని అల్లువీధి పాఠశాల వద్ద 'చినుకుపడితే చెరువే' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం ప్రచురితం కావడంతో సర్వశిక్షాభియాన్ ఈఈ శ్రీనువాస్ కుమార్ స్పందించారు. శుక్రవారం ఉదయం పాఠ శాలను సందర్శించారు. డీఈ హరిప్రసాద్, ఏఈ ఈశ్వరరావు, మండల విద్యా శాఖాధికారి జయశ్రీ, గంగరాజులతో చర్చించారు. పాఠశాల వద్ద నీరు నిల్వ ఉండకుండా చేపట్టాల్సిన చర్యలను సూచించారు. నాడు-నేడు పనుల్లో భాగంగా ఈ పాఠశాలలో మూడు ఇంకుడు గుంతలు తవ్వారని సిబ్బంది తెలి పారు. అవి ఉపయోగపడడం లేదన్నారు. 'ఆంధ్రజ్యోతి' కథనంతో సంబంధిత అధికారులు కదలి రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్లుగా ఈ సమస్యను ఏ అధికారీ పట్టించుకోలేదని చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీజీఈఏ ఉద్యోగులు



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు

కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ ఆధ్వర్యంలో ఆయా సంఘ నాయకులు శుక్రవారం సాయంత్రం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలోని సంఘ నాయకులు బాలభాస్కరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ భూషణరావు, ఉపాధ్యక్షులు అనిల్ కుమార్, వెంటేశ్వరరావు తదితరలు ఉన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

విజయనగరం రింగురోడ్డు: పట్టణంలోని రింగురోడ్డు పరిధిలోగల రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో ఉన్న మాన్సాస్ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని నగర పాలక సంస్థ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. మాన్సాస్ ట్రస్ట్ డిప్యూటీ కమిషనర్ అండ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమ నిర్మాణాన్ని తొలగించినట్లు నగర పాలక సంస్థ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఫిలిప్ తెలిపారు.

పని వద్దు.. బడి ముద్దు



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వంగర: బడిఈడు పిల్లలు పనిలో చేరకుండా పాఠశాలలో ఉండాలని ఎంఈవో దుర్గారావు, హెచ్ఎం జగదీశ్వరి అన్నారు. శుక్రవారం అరసాడలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కూలినా పట్టించుకోలేదు



తిమిడిలో వర్షాలకు కూలిన ఇల్లు

శృంగవరపుకోట రూరల్: తిమిడి ఎస్సీ కాలనీలో మూడు రోజుల క్రితం వర్షాలకు తాము నివసిస్తున్న ఇల్లు కూలిపోయినా ఏ ఒక్కరూ చూడలేదని.. ఒకవేళ చూసినా ఎటువంటి పరిహారం అందదని వీఆర్‌వో చెప్పారని బాధితురాలు అక్కివరపు దేముడమ్మ వాపోయింది. శుక్రవారం ఆమె మాట్లాడుతూ వర్షాలకు ఇల్లు కూలిపోయిందని.. తమకు గూడు కరువయిందన్నారు. ఈ విషయం వీఆర్వోకు చెబితే ప్రస్తుత వర్షాలకు ఇల్లు పడిపోతే ప్రభుత్వం పరిహారం ఇవ్వడం లేదని చెప్పారన్నారు. ఇలా అయితే తమ పేద కుటుంబాలు ఎలా బతుకుతాయని ప్రశ్నించారు. ఈ విషయమై తహసీల్దార్ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా.. బాధితులు ప్రస్తుతం కూలిన ఇంట్లో లేరని.. పక్కన నివాసం ఉంటున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. తాము కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాక పరిహారం వచ్చే అవకాశం ఉందన్నారు. అగ్ని ప్రమాదాల్లో ఇళ్లు కాలిపోతే తక్షణ సాయం ఉంటుందని.. ఇలా వర్షాలకు ఇళ్లు కూలిపోతే నివేదిక పంపించడం తప్ప పరిహారం తాము ఇవ్వలేమని చెప్పారు.

సకాలంలో పింఛన్ల పంపిణీ

రాజాం రూరల్: సకాలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. జులై ఒకటో తేదీ నుంచి ఉదయం ఆరు గంటల నుంచే ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేయాలని స్పష్టం చేశారు. కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. క్లస్టర్ వారీగా మ్యాప్ చేసిన సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు.

భార్యపై హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు

బాడంగి, జూన్ 28: భార్యను వేధించిన కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు, జరిమానా విధించినట్టు ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గజరాయనివలస గ్రామానికి చెందిన గొండేల సూరిబాబు భార్యను వేధిస్తూ 2021 సంవత్సరం జూలై 6న ఆమెపై దాడిచేసి గాయపరిచాడు. ఈ మేరకు అప్పట్లో ఎస్ఐ ఎ.నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. కాగా నిందితుడిపై నేరం రుజువు కావడంతో బొబ్బిలి సబ్ జడ్జి ఎస్.అరుణశ్రీ నిందితుడికి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, రూ.500 జరిమానా, హత్యాయత్నం చేసినందుకు రూ.10వేల జరిమానా 3 సంవత్సరాల సాధారణ జైలు శిక్ష విధించినట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు రెండు శిక్షలను ఏకకాలం అమలు చేసేలా తీర్పునిచ్చినట్టు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



విజయ్‌కుమార్ మృతదేహం

నెల్లిమర్ల, జూన్ 28: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సారిపల్లి గ్రామానికి చెందిన బోనుమహంతి విజయ్‌కుమార్(28) ఎలక్ట్రీషియన్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఓ ఇంటికి వెళ్లి మేడపైన ఉండగా ఇంటిపైనుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్లు విజయ్‌కుమార్‌కు తగలడంతో ఆయన వెంటనే కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు, కుటుంబీకులు విజయనగరం సర్వజన ఆసుపత్రికి తీసుకువెళ్లినప్పటికి ప్రయోజనం లేకపోయింది. విజయ్‌కుమార్ అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి అప్పలనర్సయ్య ఫిర్యాదు మేరకు నెల్లిమర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయన గరం సర్వజన ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలి



బొబ్బిలి చర్చిసెంటరులో ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

బొబ్బిలి, జూన్ 28: భారత న్యాయసంహిత చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక చర్చి సెంటరులో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు మాట్లాడుతూ ఐపీసీ చట్టానికి బదులు బీఎన్ఎస్ అమలు చేస్తే అది డ్రైవర్లకు ఉరితాడు బిగించినట్లేనని ఆరోపించారు. రవాణా రంగానికి సంబంధించిన క్రిమినల్ చట్టంలో 106(1),(2) నిబంధనలు చాలా కఠినతరంగా ఉన్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎవరైనా మృతి చెందితే డ్రైవరుకు మూడు నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్షపడుతుందన్నారు. వాస్తవానికి రోడ్డు ప్రమాదాలు జరగడానికి డ్రైవర్లకన్నా ప్రభుత్వాల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని నిపుణుల కమిటీ నిర్ధారించిందన్నారు. రహదారులన్నీ ఛిద్రమైపోవడం, ట్రాఫిక్ నిబంధనలపై సంపూర్ణమైన అవగాహన కల్పించకపోవడం, వాహనాల తయారీ కంపెనీలకు అనుగుణంగా వారి విక్రయాలను పెంచుకునేందుకు సహకరిస్తున్న ప్రభుత్వం ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తున్నారా? లేదా? అన్నది పట్టించుకోవడం లేదన్నారు. హైవే ల పక్కన మద్యం దుకాణాలు ఉండరాదన్న నిబంధన ఉన్నప్పటికీ వాటిని నిరోధించలేకపోతున్నారన్నారు. వచ్చే నెల 1 నుంచి అమలులోనికి రానున్న భారత న్యాయసంహిత చట్టాన్ని మోదీ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని లేకుంటే వచ్చేనెల 10 తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేస్తామని తెలిపారు. చట్టం అమలైతే రవాణా రంగం సమ్మె తథ్యమన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు ఆల్తి కృష్ణ, మోహనరావు, రాంబాబు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బేబీనాయనను కలిసిన టీడీపీ నాయకులు



బేబీనాయనను అభినందిస్తున్న రాష్ట్ర ఎస్సీసెల్ నేత రావాడ

బొబ్బిలి, జూన్ 28: బొబ్బిలి ఎమ్మెల్యేగా ఎన్నికై ఇటీవల అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసి వచ్చిన ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన)ను పలువురు కలుసుకొని అభినందనలు తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం, రణస్థలం గ్రామ సర్పంచ్ రౌతు శ్రీనివాసరావు శుక్రవారం బొబ్బిలి కోటకు వచ్చి బేబీనాయనను అభినందించారు. బొబ్బిలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, పెద్దింటి మనోజ్‌కుమార్ (బాబీ), లంక రమేష్, పైల హరిప్రసాద్, గొల్లాది ఎంపీటీసీ పామోటి గోవింద్ తదితరులు బేబీనాయనను కలుసుకొని అభినందించారు.

పండుగలా పింఛన్ల పంపిణీ చేయాలి

లక్కవరపుకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెంచిన సామాజిక పింఛన్లను జూలై 1వ తేదీన పండగవాతావరణం తలపించేలా పింఛనుదారులకు పంపిణీ చేయాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. సచివాలయ సిబ్బందికి టీడీపీ నేతలు, కార్యకర్తలు సహకరించి చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడని ప్రతి పింఛనుదారుడికి తెలియజేయాలన్నారు. మండల స్థాయి నుంచి క్లస్టర్, గ్రామ, వార్డుల నేతలు, కార్యకర్తలు పింఛను పంపిణీలో పాల్గొని పేదలందరికీ అందజేయాలని ఆమె కోరారు. ఏ ఒక్క పింఛనుదారుడికి సొమ్ము అందలేదనే అపవాదు రాకుండా కార్యకర్తలు, నేతలు చూసుకోవాలని ఆమె తెలియజేశారు.

1న ఐటీఐలో మెగా జాబ్‌మేళా

విజయనగరం దాసన్నపేట: జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జూలై 1న ఉదయం 9.30 గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టీవీ గిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఐటీఐలో ఏ ట్రేడ్ పాసైన వారైనా, ఇంటర్, డిప్లమో, డిగ్రీ అర్హతలు ఉన్నవారు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, టీవీఎస్, సుందరం ఫాస్టనర్స్, డెక్కన్ ఫెర్రో ఎల్లాయిస్, క్యూసీవ్ టెక్నాలజీ, వరుణ్ జేసీబీ, టీసీఎస్, వరుణ్‌మోటార్స్ టెక్ మహీంద్రా తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి: బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు రెండో విడత ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు తెలిపారు. ఎస్ఎస్‌సి పాసైన అభ్యర్థులు ఈ నెల 29 నుంచి వచ్చేనెల 24లోగా రిజిస్ట్రేషన్ చేసుకొని యూనిక్ నెంబరును పొందాలని ఆయన సూచించారు. బొబ్బిలి ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మెషినిస్టు, మోటారు మెకానిక్, వెహికల్, డీజిల్ మెకానిక్, వెల్డర్ ట్రేడులలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. విజయనగరం, బొబ్బిలి, రాజాం ఐటీఐలలో ఎక్కడైనా ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వచ్చే నెల 27న బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించబోయే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు హాజరు కావాలని ప్రిన్సిపాల్ రమణారావు సూచించారు.

రేపు రాజాం రచయితల వేదిక సమావేశం

రాజాం: రాజాం రచయితల వేదిక 113వ సమావేశం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈనెల 30న ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని నిర్వాహకుడు గార రంగనాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో శ్రీనాథ సాహిత్య విహంగ వీక్షణం అనే అంశంపై సాహితీ వేత్త నేతేటి గణేశ్వరరావు ముఖ్య ప్రసంగం చేస్తారన్నారు.

అందరూ అందుబాటులో ఉండాలి

రాజాం: జూలై 1వతేదీ నుంచి పింఛన్ల పంపిణీ చేపడుతున్నందున పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై సమీక్షించారు. క్లష్టర్ల వారీగా మ్యాప్‌చేసిన సచివాలయ సిబ్బంది 1న ఉదయం 6 గంటల నుంచి ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు మున్సిపల్, మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. ఈ మేరకు నూతన ఎమ్మెల్యే బేబీనాయనకు, గౌరవసభ్యులందరికీ ఆహ్వానాలు పంపినట్లు తెలిపారు.

● బొబ్బిలి మండల పరిషత్ సర్వసభ్యసమావేశం శనివారం ఉదయం ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన జరగనున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారన్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు

విజయనగరం క్రైం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని టూ టౌన్ సీఐ కోరాడ రామారావు హెచ్చరించారు. గురువారం రాత్రి కొత్తపేట, లంకా పట్టణంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి రోడ్డుపై సంచరిస్తున్న వారిని హెచ్చరించి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూటౌన్ పరిధిలో రోజూ విస్తృతంగా తనిఖీలు చేపడతామని, మద్యం తాగి పట్టుబడినా, అల్లర్లకు పాల్పడినా, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ భవనంలో తరగతులు వద్దు

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్తుభవనంలో కార్పొరేట్ కళాశాలను నిర్వహిస్తుండడంపై ఎస్ఎఫ్ఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన నిర్వహించింది. శుక్రవారం కళాశాలను పరిశీలించిన అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, మణికుమార్ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో వసతులు కల్పించకుండానే ఇంటర్ తరగతులు నిర్వహించడం సరికాదన్నారు. అధికారులు ఎలా అనుమతి ఇచ్చారు? అడ్మిషన్లు ఎలా జరిపించారు? అని ప్రశ్నించారు. దీనిపై ఆర్ఐఓ కు ఎస్ఎఫ్ఐ తరపున ఫిర్యాదు చేశామన్నారు. అధికారుల తీరుకు నిరసనగా నినాదాలుచేశారు. ఈ కార్యక్రమంలో డేవిడ్, సాయిమణి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంప్ హౌస్ వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్

రాజాం: రాజాం రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించి రేగిడి దగ్గర ఉన్న పంప్‌హౌస్ వద్ద కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్టు పురపాలక సంఘ ఏఈ వెంకటరామరాజు తెలిపారు. గురువారం ఈదురుగాలులకు హెచ్‌టీ లైన్ తెగిపోవడంతో రాజాం పట్టణంలో కొన్ని ప్రాంతాలకు శుక్రవారం తాగునీరు అందించలేకపోయామన్నారు. హెచ్‌టీ లైన్‌ను, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో శనివారం నుంచి అన్ని వార్డులకు పూర్తి స్థాయిలో కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామన్నారు.

నేడు కొత్తవలస కోర్టులో లోక్ అదాలత్

కొత్తవలస : కొత్తవలస కోర్టులో శనివారం ఉదయం 10 గంటల నుంచి మెగా లోక్ అదాలత్‌ను న్యాయమూర్తి డాక్టర్ ఎస్.విజయచందర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు న్యాయవాద సంఘ అధ్యక్షురాలు డీవీఎల్ దేవి తెలిపారు. కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ పోలీసు స్టేషన్ పరిధిలో గల కేసులతో పాటు స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులను రాజీ చేయనున్నట్టు తెలిపారు.

పరిశుభ్రతతోనే మలేరియా నిర్మూలన

రాజాం రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా నిర్మూలన సాధ్యమని పొగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి జి.భార్గవి స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మలేరియా నిర్మూలనపై పొగిరిలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిల్వ ఉంచిన ఆహారం, చేపలు, మాంసం వంటివి తినకూడదన్నారు. వీలైనంత వరకూ వేడినీళ్లు తాగాలని డా.భార్గవి సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీఈ సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

రామభద్రపురం: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, టైఫాయిడ్, వైరల్ జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నాయుడువలస పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం జేసీరాజు సూచించారు. శుక్రవారం పాఠశాలలో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, శివున్నాయుడు, కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



రాజాం రూరల్: సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



రామభద్రపురం: సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS ఆంధ్రజ్యోతి

PLOTS FOR SALE
★ SK Builders & Developers Beach Aero City. VMRDA Approved Plots. L.P. No.37/2023. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కి అతి చేరువలో మరియు బీచ్‌కి అనుకొని 150 అ॥ రోడ్ ఫేసింగ్ * ఫ్యామిలీతో ఫారన్ ట్రిప్ * ఈ ఆఫర్ కొద్ది రోజులు మాత్రమే. బ్యాంక్ లోన్ సదుపాయం. సంప్ర: 9494613168
AJV_192972

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266